సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 11 । జూలై । 2025



చట్టాలపై అవగాహన..

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి భాస్కరరావు అన్నారు.

- 8లో ▸



ఆయిల్ పామ్ రైతులతో..

ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు కలెక్టర్, రాష్ట్ర ఉద్యాన శాఖ సంచాలకులు బైబ్యాక్ ఒప్పంద పత్రాలు అందజేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.2 /23.0

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కృష్ణమోహన్



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కృష్ణ మోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. చాంబర్‌లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రసాద్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ నాగరాజు, గంగాధర్‌లు ఇతర సిబ్బంది ప్రత్యేకంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయా విభాగాల హెచ్‌వోడీలు, అధికారులు నూతన ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అవగాహన ర్యాలీలు నిర్వహించాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఘనంగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీల వైద్యాధికారులతో జిల్లాస్థాయి సన్నాక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ శుక్రవారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలో అర్హులైన దంపతుల రిజిస్టర్లను సవరించాలన్నారు. దంపతులందరూ శాశ్వత, తాత్కాలిక కుటుంబ పద్ధతులను అవలంబించేలా చూడాలన్నారు. జిల్లాలో పురుషుల కోసం కుటుంబ నియంత్రణ చికిత్స అయిన ఎన్ఎస్‌వీ /వాసక్టమి ఆపరేషన్లు ఆర్మూర్, డిచ్‌పల్లి, మోర్తాడ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుప్రియ, డాక్టర్ సామ్రాట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి 6,100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 6,100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 241 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1068.20(20.3టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 1061.8(12.32టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.



కలిసి ఉంటే కలదు సుఖం

ఆర్మూర్‌లోని మామిడిపల్లికి చెందిన రామయ్యగారి నర్సింహులు కుటుంబం ఇప్పటికీ ఉమ్మడిగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తోంది. నర్సింహులు లేకపోయినప్పటికీ వారి నలుగురు కుమారులు, వారి వారి సంతానం కలిసి జీవిస్తున్నారు. ప్రస్తుతం ఐదుగురు పెద్దమనుషులు, పది జంటలు, 25 మంది పిల్లలతో కలుపుకొని మొత్తం 50 మంది ఒకే ఇంట్లో కలిసి ఉంటున్నారు. వ్యవసాయ కుటుంబం కావడంతో పెద్దలంతా పొలాల్లో పనిచేస్తారు. సాయంత్రం ఇంటికి చేరుకొని కుటుంబసభ్యులతో సరదాగా గడుపుతారు. రెండు నెలల క్రితం సన్నరకం బియ్యం పథకం పరిశీలనకు వచ్చిన ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నేటితరానికి నర్సింహులు కుటుంబం ఆదర్శమని కొనియాడారు.

కొండంత బలం..



నందిపేట మండల కేంద్రానికి చెందిన కస్తూరి లింబాద్రి, లక్ష్మీబాయిలకు ముగ్గురు సంతానం. వారిలో కస్తూరి గంగాధర్ (టైలర్), కస్తూరి ప్రవీణ్ (బీపీఎం), కస్తూరి సాగర్ (ఆర్మీ). ముగ్గురు అన్నదమ్ములకు వివాహాలు జరిగి పిల్లలు అయినప్పటికీ ఉమ్మడి కుటుంబంగానే ఉంటున్నారు. కష్టసుఖాలలో ఒకరికొకరు తోడుగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎప్పటికీ ఇలాగే కలిసి ఉంటామని చెబుతున్నారు.



ఆది నుంచి ఉమ్మడిగానే..

మోర్తాడ్‌లోని సిరిసినహాళ్ దేశీకాచారి కుటుంబం మొదటి నుంచి ఉమ్మడిగానే ఉంటోంది. ఉద్యోగాల నిమిత్తం కుటుంబసభ్యులు అమెరికా, నిజామాబాద్, హైదరాబాద్‌లలో పనిచేస్తున్నప్పటికీ పండుగలు, శుభకార్యాలు మాత్రం అందరూ కలిసి మోర్తాడ్‌లోనే చేసుకుంటారు. సిరిసినహాళ్ వెంకటాచారికి నలుగురు కొడుకులు. పెద్ద కుమారుడు దేశీకాచారి తన ముగ్గురు సోదరులతో కలిసి జీవించారు. తదనంతరం దేశీకాచారి ముగ్గురు కుమారులు, వారి సంతానం అంతా ఉమ్మడి కుటుంబంగానే ఉన్నారు. దేశీకాచారి పెద్ద కుమారుడు గోపాలచారి, రెండో కుమారుడు నంబులాద్రి చారి, మూడో కుమారుడు నరసింహమూర్తి, వాళ్ల కుమారులు ఇప్పటికీ విడిపోలేదు. దేశీకాచారి మరణం తర్వాత కుటుంబ బాధ్యతలను గోపాలచారి నిర్వహిస్తున్నారు. ఆయన తీసుకునే నిర్ణయాలకు ఇంట్లో ఎవరూ అడ్డుచెప్పరని స్థానికులు చెబుతున్నారు.

ఉమ్మడిగానే జీవిద్దాం

సమష్టి కుటుంబాలకు పునర్వైభవం

- కోవిడ్ తర్వాత మారుతున్న దృక్పథం
- బంధాలు బలహీనం కాకుండా ఉండాలంటున్న పలువురు
- సంతానం విషయంలోనే భిన్నాభిప్రాయాలు
- ప్రస్తుత జీవన ప్రమాణాల నేపథ్యంలో ఒకరిద్దరికే పరిమితమంటున్న అధికులు
- జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న కొన్ని ఉమ్మడి కుటుంబాలు
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



మరికొందరి అభిప్రాయాలు 8లో..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి కుటుంబాల్లో భావోద్వేగాలకు, ఆప్యాయతలకు చోటుంటుంది. అలాంటి కుటుంబ వ్యవస్థలో గత మూడు దశాబ్దాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటూ వచ్చాయి. గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ దాదాపుగా కనుమరుగయ్యే దశకు చేరుకుంది. అక్కడక్కడా వేళ్లమీద లెక్కించే స్థాయిలో మాత్రమే ఉమ్మడి కుటుంబాలు నడుస్తున్నాయి. అయితే, కోవిడ్ తర్వాత మాత్రం కొంత మేర మార్పు వస్తోంది. కొందరు మళ్లీ ఉమ్మడి కుటుంబాల వైపు ఆసక్తి చూపుతున్నారు. కానీ, ఆచరణలో మాత్రం అనుకున్నవిధంగా అడుగులు వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. మారిన జీవన విధానం, ఉపాధి కోసం వలసలు వెళ్లాల్సిన తప్పని పరిస్థితుల్లో చిన్నచిన్న కుటుంబాలుగానే నివసించక తప్పని పరిస్థితి నెలకొందని అత్యధిక మంది చెబుతున్నారు. ఉమ్మడి కుటుంబంతోపాటు సంతానం ఎక్కువగా ఉంటే బంధాలు మరింత బలపడతాయని చెబుతున్నప్పటికీ, మారిన జీవన విధానం, ఖర్చుల పెరుగుదలతో ఒకరిద్దరు సంతానాన్ని మాత్రమే కంటామని యువ జంటలు చెబుతున్నాయి. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం. అందులో భాగంగా నిర్వహించిన సర్వేలో పలువురు భిన్నాభిప్రాయాలను వ్యక్తంచేశారు.

■ జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 25,51,335 మంది ఉన్నారు. జనాభా పెరుగుదల 2001లో 15.2 శాతం, 2011లో 8.7 శాతంగా నమోదైంది. జననాల రేటు 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి 31 వరకు 10,988 మంది బాలురు జన్మించగా, బాలికలు 9,932 మంది జన్మించారు. 904 మంది తేడా ఉంది.

జిల్లాలో 25 ఏళ్లకు పైబడి వివాహ ప్రయత్నాలలో ఉన్న వారి అభిప్రాయాలు

■ ఉమ్మడి కుటుంబం మంచిదా.. చిన్న కుటుంబం కోరుకుంటున్నారా?
అ) ఉమ్మడి కుటుంబమే మంచిది: 55
ఆ) చిన్న కుటుంబమే బాగుంటుంది: 20

■ ఎంత మంది సంతానాన్ని కనాలనుకుంటున్నారు?
అ) ఒకరు లేదా ఇద్దరు: 60
ఆ) ముగ్గురు పిల్లలు: 15

■ ఇద్దరికంటే ఎక్కువ సంతానంతో ప్రయోజనం ఉంటుందా.. ఉండదా?
అ) ఉంటుంది: 58 ఆ) ఉండదు: 17

■ ప్రస్తుతం తోబుట్టువుల మధ్య అనుబంధం ఎలా ఉంది?
అ) అంతంత మాత్రమే: 41
ఆ) బాగానే ఉంది: 10
ఇ) డబ్బుకు, ఆస్తులకు ప్రాధాన్యం: 24

చిన్న కుటుంబాన్ని ఇష్టపడతాను



ప్రస్తుత పరిస్థితుల్లో ఉమ్మడి కుటుంబం కష్టం. ఆడ అయినా, మగ అయినా ఇద్దరు పిల్లలు ముద్దు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని భార్యాభర్తలిద్దరం కలిసి ఈ నిర్ణయం తీసుకున్నాం. మాది మధ్యతరగతి కుటుంబం. ఇద్దరినీ మంచిగా చదివిస్తూ ఉన్నతుల్ని చేస్తాను. జన్నెపల్లి క్రాస్‌రోడ్డులో దుకాణం ఉంది. ఈ వ్యాపారంతో నేను, నా కుటుంబం ప్రశాంతంగా జీవిస్తున్నాం.

– సిరియాల రవికుమార్, ఛిక్లి, మాక్లూర్ మండలం

తక్కువ జనాభాతో సమాజానికి మేలు..



పెరుగుతున్న నిత్యావసర ధరల కారణంగా తక్కువ జనాభా ఉంటేనే మేలు. పైగా పిల్లలను ఉన్నత విద్య చదివించాలంటే ఎక్కువగా ఖర్చు అవుతోంది. దీంతో ఇద్దరు పిల్లలతో సరిపెట్టుకున్నాం. వారిని సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుంది.

– అంకం నరేశ్, ఉపాధ్యాయుడు, జక్రాన్‌పల్లి

ఉమ్మడిగానే బాగుంటుంది..



ఉమ్మడిగా ఉంటే అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, తమ్ముళ్లు, మనుమలు, మనుమరాళ్లు, తాతలతో ప్రేమలు ఎక్కువగా ఉంటాయి. దీంతో రోజువారీ చేసే పనిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మానసికంగా ఆరోగ్యకరంగా ఉంటారు. ప్రస్తుత యువతీయువకులు ఉమ్మడి కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలి.

– చిలువేరి గణేశ్, వర్తకుడు, నిజామాబాద్

ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రత్యేకాధికారి ఒడ్డెన్న

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ విద్యలో అడ్మిషన్‌ల సంఖ్య పెంచాలని, అలాగే ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఒడ్డెన్న సూచించారు. నగరంలోని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో గురువారం డీఐఈవో తిరుమలపుడి రవికుమార్ అధ్యక్షతన జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఒడ్డెన్న మాట్లాడుతూ.. పదో తరగతిలో పాసైన విద్యార్థులు ఇప్పటికీ ఏ కళాశాలలోనూ చేరకపోతే వారిని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేలా కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్స్ తమ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలను సందర్శించి, ఎస్సెస్సీ పూర్తయిన విద్యార్థులు ఎక్కడ చేరారో వివరాలు సేకరించాలన్నారు. అడ్మిషన్‌ల డేటా మొత్తం ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. త్వరలో నిర్వహించబోయే పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇంటర్ బోర్డు మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకొని పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు ప్రిన్సిపాల్స్ కళాశాలల్లోని సమస్యలను తెలిపారు. అంతకుముందు ఒడ్డెన్న కోటగిరి, వర్ని, నిజామాబాద్ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

ఐటీఐతో ఉపాధి అవకాశాలు

నిజామాబాద్‌అర్బన్: ఐటీఐ (పారిశ్రామిక శిక్షణ సంస్థ)లతో విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని, ఈ సంస్థలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐని గురువారం ఆయన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి సందర్శించారు. టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, స్టెనో తదితర ట్రేడ్ లకు సంబంధించిన వర్క్ షాప్‌లను పరిశీలించారు. శిక్షణ తీరు గురించి, అందుబాటులో ఉన్న యంత్ర పరికరాల గురించి ప్రిన్సిపాల్ యాదగిరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కిల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ శిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ తోడ్పాటును విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఐటీఐలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ప్రాథమికంలో మెరుగు'బడి'

- ఉన్నతంలో వెనుకడుగు
- జాతీయ సాధన సర్వేలో ఆశాజనక ఫలితాలు
- గత సర్వే ఫలితాల కంటే మెరుగు
- ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ కార్యక్రమాలతో విద్యా వ్యవస్థలో మార్పులు



నిజామాబాద్‌అర్బన్: విద్యావ్యవస్థలో మార్పు మొదలైంది. బోధనాభ్యసన ప్రక్రియలో సత్ఫలితా లు వస్తున్నాయి. రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న తొలిమెట్టు(ఎఫ్ఎల్ఎన్), లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమాలతో విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతూ అభ్యసన ఫలితాలు మెరుగవుతున్నాయి. ఇటీవల కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఫరక్ రాష్ట్రీయ, సర్వేక్షణ(న్యాస్) సర్వే నివేదికలో ఉమ్మడి జిల్లా మెరుగైన స్థానంలో ఉంది.

సర్వే ఇలా..

ఉమ్మడి జిల్లాలో దాదాపు 180 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2024 డిసెంబర్ 4న న్యాస్, ఎన్‌సీఈఆర్టీ సంయుక్తంగా రాష్ట్రీయ సర్వేక్షణ్-ఫరఖ్ సర్వేను నిర్వహించాయి. ఫలితాలను ఉదిత్, ఉదయ్, ఉన్నత్, ఉద్భవ్ అనే నాలుగు కేటగిరీలుగా వర్గీకరించి కేంద్ర విద్యాశాఖ విడుదల చేసింది. 25 శాతం కంటే తక్కువ అభ్యసన స్థాయిలను కలిగి ఉంటే ఉద్భవ్‌గా, 25–50 మధ్య ఉంటే ఉన్నతిగా, 50–75 మధ్య ఫలితాలను ఉదయ్, ఆపైన ఫలితాలు వస్తే ఉదిత్‌గా ప్రకటించారు. కేంద్రం విడుదల చేసిన ఈ ఫలితాలలో ఉమ్మడి జిల్లా ఆశాజనక స్థానం సాధించింది.

■ 3వ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా 9వ, నిజామాబాద్ 18వ స్థానాన్ని సాధించాయి. గత న్యాస్ సర్వే కంటే పది స్థానాలు మెరుగుపడినాయి. అలాగే ప్రైవేట్ బడుల కంటే ప్రభుత్వ బడులలో అభ్యసన సామర్థ్యాలు పెరిగినాయి. 6వ తరగతిలో భాష, గణితంలో ఉన్నతి, ఉద్భవ్ స్థాయిలో ఉండగా, సామర్థ్యాల పరంగా వెనుకబడ్డాయి. 9వ తరగతిలో అభ్యసన ఫలితాలు మెరుగయ్యాయి.

తరగతులవారీగా అభ్యసన స్థాయి శాతం

సబ్జెక్టు/విషయం	3వ	6వ	9వ
భాష	58	53	54
గణితం	54	44	36
సైన్స్	-	-	39
సోషల్‌స్టడీస్	-	-	38

ప్రభుత్వ బడులు బలోపేతం

2022 ఆగస్టు 15 నుంచి ప్రవేశపెట్టిన తొలిమెట్టు, లిప్ కార్యక్రమాలతో ప్రభుత్వ బడులలో అభ్యసన ఫలితాలు మెరుగయ్యాయి. అలాగే డీఎస్సీ-2024, డీఎస్సీ-2008 ద్వారా జిల్లాలో నూతనంగా నియామకమైన 650 ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై విద్యార్థులకు గుణాత్మక విద్య అందిస్తున్నాయి. కనీస అభ్యసన సామర్థ్యాలను సాధించడంతోపాటు తరగతి గది అభ్యసన ఫలితాలను సాధించేందుకు గత విద్యా సంవత్సరం నుంచి పంపిణీ చేసిన వర్క్‌బుక్‌లు దోహదపడ్డాయి.

ఉపాధ్యాయుల కృషితోనే..

ఇటీవల వెలువడిన జాతీయ సాధన సర్వేలో మంచి ఫలితాలు రావడం శుభ పరిణామం. ఉపాధ్యాయుల కృషితోనే ఇది సాధ్యమైంది. ప్రాథమిక స్థాయిలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తే ఇంకా మెరుగైన ఫలితాలు సాధిస్తాం.

– అంకం నరేశ్, పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు

ఇన్‌చార్జులతో ఇంకెన్నాళ్లు?

- సీనియర్ అసిస్టెంట్లతో కొనసాగుతున్న అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం
- ఆఫీస్‌లో డాక్యుమెంట్ రైటర్లదే హవా
- సబ్ రిజిస్ట్రార్లుగా వచ్చేందుకు జంకుతున్న అధికారులు
- పర్యవేక్షణ లేక ఇన్‌చార్జుల ఇష్టారాజ్యం!



నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

సుభాష్‌నగర్: ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖకు కీలకమైన నిజామాబాద్ అర్బన్ కార్యాలయం ఇన్‌చార్జుల పాలనలో కొనసాగుతోంది. ఏడాదిగా ఇక్కడ సీనియర్ అసిస్టెంట్లే సబ్ రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తే ఇలా వచ్చి.. అలా సెలవుపై వెళ్తున్నారు. ఏసీబీ దాడులు, డాక్యుమెంట్ రైటర్ల బెదిరింపుల కారణంగానే ఇక్కడికి సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చేందుకు అధికారులు భయపడుతున్నట్లు తెలిసింది.

కొరవడిన పర్యవేక్షణ..

జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) కార్యాలయ ఆవరణలోనే ఈ కార్యాలయం ఉంటుంది. అయినా అధికారులు, డాక్యుమెంట్ రైటర్లు, సిబ్బంది వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత మంగళవారం మధ్యాహ్నం 12 గంటలైనా సబ్ రిజిస్ట్రార్లు కార్యాలయానికి రాలేదంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయంటేనే పరిస్థితికి అద్దం పడుతోంది. మరోవైపు ఉన్న ఒక్క ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ చేసిందే డాక్యుమెంట్.. చెప్పిందే నిబంధనగా తయారైంది. డాక్యుమెంట్‌లో చిన్నచిన్న తప్పిదాలను సాకుగా చూపి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు సెలవులో వెళ్లడం, ఇన్‌చార్జులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం జిల్లా రిజిస్ట్రార్‌కు తలనొప్పిగా మారింది.

రైటర్లను కట్టడి చేయడంలో విఫలం?

డాక్యుమెంట్ రైటర్లను కట్టడి చేయడంలో కార్యాలయ అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందనే చెప్పాలి. రైటర్లు చెప్పినట్లు చేయకుంటే అధికారులపైనే బెదిరింపులకు దిగడం, దుకాణాలు మూసేసి ఆందోళనలు చేసిన ఘటనలూ ఉన్నాయి. గతంలో ఓ రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి పట్టుబడటంలో రైటర్ల పాత్ర ఉందనే విమర్శలు వెల్లువెత్తాయి. కలిసి పనిచేసే వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లు చేస్తామంటే మాత్రం బెదిరింపులు ఎదుర్కోవాల్సిందే. రాష్ట్రంలో ఏ కార్యాలయంలోనూ ఈ పరిస్థితి లేదని, ఇక్కడే ఇలా ఉందని శాఖలోని ఓ ఉన్నతస్థాయి అధికారి పేర్కొనడం గమనార్హం. ఇప్పటికైనా రైటర్లను కట్టడి చేయకపోతే సబ్ రిజిస్ట్రార్లు పనిచేసే పరిస్థితి లేదనే అభిప్రాయం ఆ శాఖ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

పది రోజుల్లో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు

నిజామాబాద్ అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వారం, పదిరోజుల్లో రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు వచ్చే అవకాశముంది. ఇక్కడికి రావడానికి సబ్ రిజిస్ట్రార్లు భయపడుతున్నారు. నిజామాబాద్ పరిస్థితిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే మార్పులు, చేర్పులు ఉంటాయని భావిస్తున్నాం.

– వెంకటరమణ, డీఐజీ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్లశాఖ, నిజామాబాద్

క్లుప్తంగా

గ్రామ బహిష్కరణపై విచారణ



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని గ్రామ అభివృద్ధి కమిటీ గతంలో గ్రామానికి చెందిన స్రవంతి భర్త లింగం, రజక సంఘ సభ్యులపై గ్రామ బహిష్కరణ విధించగా, ఈ ఘటనపై గురువారం ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన స్రవంతి తన కుటుంబ సభ్యులను గ్రామ బహిష్కరణ చేశారని పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేసింది. అంతేకాక రజక సంఘ సభ్యులు సైతం మమ్మల్ని గ్రామ బహిష్కరణ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువురితో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి జక్రాన్‌పల్లిలో విచారణ చేపట్టారు. ఇరువురితో మాట్లాడి బహిష్కరణకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ బహిష్కరణ చట్టరీత్యా నేరమని ఏసీపీ తెలిపారు. బహిష్కరణ విషయంలో నిజనిర్ధారణ కమిటీ సభ్యుల ద్వారా వివరాలు సేకరించారు. బాధిత కుటుంబాలకు చట్టపరంగా న్యాయం జరిగేలా చూస్తామని ఏసీపీ తెలిపారు. డిచ్‌పల్లి సీఐ వినోద్, జక్రాన్‌పల్లి ఎస్సై మాలిక్ రహమాన్, వీడీసీ వ్యతిరేక కమిటీ సభ్యుడు బట్టు శ్రీధర్, బహుజన నాయకుడు బంగారు సాయిలు, నాయకులు కనక రాజేష్, దేవన్న పాల్గొన్నారు.

చర్చిలో జన్మదిన వేడుకలు



ఆర్మూర్‌లోని చర్చిలో కేక్ కట్ చేస్తున్న గోర్త రాజేందర్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జీసెస్ మిరాకిల్ మినిస్ట్రీస్ చర్చిలో గురువారం పాస్టర్ ఆనంద్ పాల్ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గోర్త రాజేందర్ పాల్గొని పాస్టర్‌ల సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాలను జరుపుకున్నారు. రాజేందర్ మరెన్నో పదవులు సాధించాలని పాస్టర్ దీవించారు. చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడిగానే జీవిద్దాం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి కుటుంబమే ఉత్తమమని పలువురు పేర్కొంటున్నారు. ఉమ్మడి కుటుంబంతోపాటు సంతానం ఎక్కువగా ఉంటే బంధాలు మరింత బలపడతాయని చెబుతున్నప్పటికీ, మారిన జీవన విధానం, ఖర్చుల పెరుగుదలతో ఒకరిద్దరినే కంటామని యువ జంటలు చెబుతున్నాయి. ప్రపంచ జనాభా దినోత్సవం నేపథ్యంలో సాక్షి నిర్వహించిన సర్వేలో పలువురు భిన్నాభిప్రాయాలను వ్యక్తంచేశారు.

చిన్న కుటుంబమే సురక్షితం



బోధన్‌లోని పాలెంకర్ అరుణ్‌కుమార్ కుటుంబం

బోధన్: చిన్న కుటుంబాలే సురక్షితంగా, భద్రత, భరోసాలతో ఉంటాయని బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాలెంకర్ అరుణ్‌కుమార్–సౌమ్య దంపతులంటున్నారు. కుటుంబ ఆదాయ వనరులు, పిల్లల చదువులు, ఆరోగ్యం, పెళ్లిళ్లను దృష్టిలో పెట్టుకుని ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులుంటాయని పేర్కొన్నారు. పిల్లలు పుట్టిన నాటి నుంచి చదువులతో పాటు వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే వరకు తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం ఉంటుందన్నారు. అరుణ్ కుమార్ దంపతులకు ఇద్దరు కూతుర్లు లాస్య(16) లహరి(14) ఉన్నారు. మూడో సంతానం కోసం ఆలోచన చేయలేదు. ఆయన ప్రస్తుతం సాలూర జెడ్పీహెచ్‌ఎస్‌లో హిందీ సబ్జెక్ట్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

ఉమ్మడి కుటుంబమే మేలు..



ప్రస్తుత రోజుల్లో పిల్లలకు పెళ్లి చేయాలంటే కుటుంబం గురించి క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు. అబ్బాయి తల్లిదండ్రులు ఆరోగ్యంగా ఉన్నారా.. లేదా, అమ్మాయి మెట్టినింటికి వెళ్లి అక్కడ సేవలు చేయాలనే కోణంలో ఆలోచిస్తున్నారు. పోటీ ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇతర వైట్‌కాలర్ ఉద్యోగాలు చేసేవారు ఇలా ఆలోచిస్తున్నారు. ఉమ్మడి కుటుంబం ఉంటే ఆర్థికంగా బలంగా ఉండొచ్చు. సమస్యలు వస్తే సమష్టిగా ఎదుర్కోవడానికి అవకాశం ఉంటుంది.

– కొర్వ గంగాధర్, మాజీ సర్పంచ్, ఖానాపూర్

అన్యోన్య కుటుంబం 'గుప్తా బ్రదర్స్'

బోధన్: బోధన్ పట్టణంలోని హెడ్‌పోస్టాఫీస్ ప్రాంతానికి చెందిన చిదుర గుప్తా బ్రదర్స్ ఉమ్మడి కుటుంబం వివిధ వ్యాపారాల్లో స్థిరపడి ప్రత్యేక గుర్తింపు పొందింది. మూడు తరాల కుటుంబ సభ్యులు ఒకే చోట ఉంటున్నారు. పట్టణ కేంద్రానికి చెందిన చిదుర గంగాధర్ గుప్తా–సరస్వతీ దంపతులకు ప్రతాప్ గుప్తా, ప్రదీప్ గుప్తా, ఇద్దరు కూతుర్లు ఉండగా, అందరి వివాహాలయ్యాయి. ప్రతాప్ గుప్తాకు ఆయన సతీమణి ఉమా, కూతురు, కొడుకు, కోడలు, మనుమడున్నారు. ఇద్దరు కూతుళ్ల వివాహాలు అయ్యాయి. ప్రదీప్‌గుప్తాకు సతీమణి పద్మ, ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. ఓ కూతురు వివాహం చేశారు. ఇద్దరు అన్నదమ్ములకు సంబంధించి మొత్తం 9 మంది కుటుంబ సభ్యులు ఒకే చోట ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. పలు వ్యాపార దుకాణాలు, సంస్థలకు గుప్తా బ్రదర్స్ పేరు పెట్టారు. ఆర్యసమాజ్, అనేక సామాజిక సేవ కార్యక్రమాల్లో ఇద్దరు అన్నదమ్ములు పాల్గొంటున్నారు. చిదుర గంగాధర్ గుప్తా, ఆయన సతీమణి కొంతకాలం క్రితం సహజ మరణం పొందారు. గంగాధర్ గుప్తా తమ్ముడు రాజలింగం కుటుంబం కలిసి ఉండేవారు. ఉమ్మడిగా జీవించడం వల్ల కుటుంబ సభ్యులు కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటారని, బంధుత్వం బలపడుతుందని వీరు పేర్కొంటున్నారు.



బోధన్‌లోని చిదుర ప్రతాప్ గుప్తా, ప్రదీప్ గుప్తా కుటుంబ సభ్యులు



బోధన్‌లోని మంచాల లక్ష్మణ్ (లడ్డు సేట్) ఉమ్మడి కుటుంబ సభ్యులు

మూడుతరాలుగా..

బోధన్: బోధన్ పట్టణంలోని గోశాల రోడ్డు ప్రాంతానికి చెందిన మంచాల లక్ష్మణ్ (90) (లడ్డు సేట్)ది మధ్యతరగతి వ్యాపార ఉమ్మడి కుటుంబం. మూడుతరాల కుటుంబ సభ్యులు కలిసి ఉంటున్నారు. మంచాల లక్ష్మణ్ తల్లిదండ్రులు భూమయ్య, భూదేవి కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి బోధన్‌కు వచ్చి స్థిరపడ్డారు. భూమయ్య దంపతులకు ముగ్గురు సంతానం మంచాల లక్ష్మణ్, పెంటయ్య, భద్రాచలం. పెద్ద కుమారుడైన లక్ష్మణ్‌కు ఆరుగురు కుమారులు, కూతురు ఉన్నారు.అందరి పెళ్లిళ్లు అయ్యాయి. కొడుకు– కోడళ్లు స్వామి– నిర్మల, శ్రీనివాస్–సునీత, శంకర్–చైతన్య, అశోక్–కవిత, దశరథ్–వాణి, శరత్–పవిత్ర దంపతులకు మొత్తం పది మంది పిల్లలున్నారు. లక్ష్మణ్ రెండో సోదరుడు పెంటయ్యకు భార్య, కొడుకు, మూడో సోదరుడు భద్రాచలం కు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. లక్ష్మణ్ ఇటీవల మృతి చెందగా గతంలో ఆయన సతీమణి చనిపోయారు. మూడో సోదరుడు భద్రాచలం కొన్నేళ్ల క్రితం చనిపోయారు. మంచాల ఉమ్మడి కుటుంబంలో ప్రస్తుతం మొత్తం 26 మంది ఉంటారు. కుటుంబ సభ్యులు వివిధ చిరువ్యాపారాలు, ప్రైవేట్ స్కూల్స్‌లో టీచర్లుగా పని చేస్తూ ఒకే ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. సమష్టి నిర్ణయంతో కుటుంబ వ్యవహారాలను చక్కదిద్దుకుంటారు.

చిన్న కుటుంబంతో సమస్యలుండవు..



మాది మధ్యతరగతి కుటుంబం. దేశంలో జనాభా భారీగా ఉన్నందున కుటుంబ నియంత్రణ పాటించాలన్న ఉద్దేశంతో నా భర్త, నేను బాలురైనా, బాలికలైనా ఇద్దరినే కనాలని నిర్ణయించుకున్నాం. చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అనేదాన్ని బాగా నమ్ముతాను. వచ్చే ఆదాయానికి అనుగుణంగా కుటుంబాన్ని నడుపుకుంటాం. – సిరియాల నవనీత, చిక్లి, మాక్లూర్ మండలం

ఒక్కరైతేనే బాగుంటుందని..

మాది వ్యవసాయ కుటుంబం. మాకు 12 ఏళ్ల కింద పెళ్లి జరిగింది. ఎవరైనా సరే ఒక్కరే చాలని నిర్ణయించుకున్నాం. ఒక కూతురు జన్మించింది.

–గడ్డం చిన్నారెడ్డి–మంజుల రెంజర్ల, ముప్కాల్ మండలం

నికాల్‌పూర్ మరో పేరు లక్ష్మీనారాయణపురం

మీకు తెలుసా?

మండలంలో ముంపు గ్రామమైన నికాల్‌పూర్‌కు లక్ష్మీనారాయణపురం అనే మరో పేరు కూడా ఉంది. మరికొందరు జంగంపల్లి అని కూడా పిలిచేవారట.



నికాల్‌పూర్ ముఖ చిత్రం

- సుమారు 155 ఏళ్ల క్రితం పంటలకు, పశువులకు నీటి కొరత ఉందనే కారణంతో లక్ష్మీనారాయణపురం గ్రామస్తులందరూ గోదావరి ఒడ్డున నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్లకు భూములు ముంపునకు గురికావడంతో ఎత్తయిన ప్రాంతానికి వచ్చి ఇళ్లను నిర్మించుకున్నారు.
- ఇలా పలుమార్లు వారి భూములు ముంపునకు గురికావడంతో ప్రతిసారి వారు వేరే ఎత్తయిన ప్రాంతానికి వచ్చి నివాసాలను ఏర్పాటుచేసుకున్నారు.
- మూడుసార్లు గ్రామస్తులు ఆయా ప్రాంతాల నుంచి వెళ్లిపోవడంతోనే లక్ష్మీనారాయణపురం గ్రామానికి నికాల్‌పూర్ అనే పేరు వచ్చినట్లు ఊరి పెద్దలు చెప్తున్నారు. నికాల్ అంటే హిందీలో వెళ్లిపోవడం అని అర్థం.
- ప్రస్తుతం గ్రామంలో 534 నివాస గృహాలు, 1200 ఎకరాల సాగుభూమి ఉంది.
- నికాల్‌పూర్ మొదటి గ్రామ సర్పంచ్‌గా ఆనంద్‌రావు 1969లో పని చేశారు.
- గ్రామంలో జంగం చెరువు, ఊర చెరువు, కొత్తకుంట అనే మూడు చెరువులు ఉన్నాయి. పాత గ్రామంలో ఓ కాలనీకి వేంకటేశ్వర పల్లె అనే పేరు ఉండేది. దానికి గుర్తుగా గ్రామస్తులు ఇటీవల ఊరి నడిబొడ్డున వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించుకున్నారు.
- పాత గ్రామంలోని హనుమాన్ ఆలయం ప్రతీ ఏటా వర్షాకాలంలో ముంపునకు గురై వేసవిలో తేలుతుంది. అప్పుడు ఊరంతా వెళ్లి పూజలు నిర్వహిస్తారు.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

సమాచారం..

ఐపీసీ స్థానంలో బీఎన్ఎస్

ఆర్మూర్: భారతదేశంలో నేరస్తులకు శిక్షలు విధించడానికి, విచారణ కోసం బ్రిటీష్ కాలంలో రూపొందించబడిన చట్టాలే 2024 వరకు కొనసాగాయి. శిక్షలు విధించడానికి 1860లో ఐపీసీ(ఇండియన్ పీనల్ కోడ్), 1973లో సీఆర్పీసీ(క్రిమినల్ ప్రొసీజర్ కోడ్), 1872లో ఐఈఏ(ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్)లను రూపొందించారు.

- ఈ చట్టాలను సవరిస్తూ 2023 డిసెంబర్ 25న కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం చేసింది.
- ఐపీసీని బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత)గా, సీఆర్పీసీని బీఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత)గా సవరించింది. అలాగే ఐఈఏని బీఎస్ఏ(భారతీయ సాక్ష్య అధినియం)గా మారుస్తూ 2024 జూలై 1నుంచి అమలులోకి తీసుకొచ్చారు.
- ప్రస్తుతం పోలీస్‌స్టేషన్లలో నమోదు చేయబడ్డ వివిధ కేసులపై నూతన చట్టం ఆధారంగా కోర్టుల్లో విచారణ చేపట్టి సాక్ష్యాల ఆధారంగా న్యాయమూర్తులు నేరస్తులకు శిక్షలను ఖరారు చేస్తున్నారు.
- ఐపీసీలో 511 సెక్షన్లు ఉండగా బీఎన్ఎస్‌లో 358 సెక్షన్లకు కుదించారు.
- సీఆర్పీసీలో 484 సెక్షన్లు ఉండగా బీఎన్ఎస్ఎస్‌లో 531 సెక్షన్లకు పెంచారు.
- ఐఈఏలో 167 సెక్షన్లు ఉండగా బీఎస్ఏలో 170 సెక్షన్లకు పెంచారు.

కల్లుడిపోల తనిఖీ



కల్లుడిపోలోని కల్లును పరిశీలిస్తున్న అధికారులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఒకటవ, రెండవ, మూడవ కల్లు డిపోలను ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ డిపోలకు ఉన్న ఈతవనాలను తనిఖీలు చేశారు. వీటి నుంచి వచ్చిన కల్లు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే డిపోలకు సంబంధించిన లైసెన్స్‌లను పరిశీలించి, ఎంత వరకు పర్మిషన్ ఉందో వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. అక్కడ తయారైన కల్లుకు టెస్ట్‌లు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్లు తయారుచేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. స్వచ్ఛమైన కల్లును మాత్రమే విక్రయించాలని డిపోలోని గీతా కార్మికులకు సూచించారు. అలాగే నిజామాబాద్ రూరల్ పరిధిలోని మల్లారం గ్రామంగల 16 ఎకరాల్లో ఉన్న ఈతవనాలను పరిశీలించారు. ఇక్కడ నుంచి ఎన్ని లీటర్ల కల్లు వస్తుంది అనే వివరాలను తెలుసుకున్నారు. కల్లు డిపోలకు 8,600 చెట్లు ట్యాపింగ్ అలాట్‌మెంట్ అయినట్లు పేర్కొన్నారు. సుమారు 46 మంది ముస్తేదారులు ప్రతిరోజు ఈత వనం నుంచి కల్లుగీస్తున్నట్లు గీతకార్మికులు డీసీకి వివరించారు. హైదరాబాద్‌లోని కల్తీకల్లు ఘటన సందర్భంగా కల్లుడిపోలను ఎక్సైజ్ అధికారులు పరిశీలించినట్లు ప్రచారం జరుగుతుంది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి ఏడీ స్వప్న, ఇన్‌చార్జి ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో సుస్మిత, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాబాలపై పోలీసుల దాడులు

మాక్లూర్: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న దాబాలపై గురువారం స్థానిక ఎస్సై రాజశేఖర్ ఆదేశం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. నిబంధనలు పాటించని ఇద్దరు దాబా యజమానులను బైండవర్ చేశారు. మాక్లూర్‌లోని డక్‌ఫారం వద్ద ఉన్న రెండు దాబాలతో పాటు దాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో నడుస్తున్న దాబాలన్నింటిపై దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. మద్యం సిట్టింగులు జరుపుతున్నారనే సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



శాపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి భాస్కర్‌రావు

నందిపేట్ (ఆర్మూర్): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి భాస్కరరావు అన్నారు. నందిపేట మండలం శాపూర్ గ్రామంలో గురువారం జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టపరమైన అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి భాస్కర్ రావుతోపాటు మరో నలుగురు సీనియర్ న్యాయవాదులు హాజరై, అంశాలపై అవగాహన కల్పించారు. కొన్ని గ్రామాలలో గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)లు చట్టాన్ని చేతిలోకి తీసుకొని సమాంతర ప్రభుత్వం నడుపుతున్నట్లు తెలిసిందన్నారు. వీడీసీలు అభివృద్ధి పనులు చేపట్టాలి కానీ చట్ట వ్యతిరేక పనులు చేయరాదని సూచించారు. గ్రామ అభివృద్ధిలో యువత ముఖ్య భూమిక పోషించాలన్నారు. ప్రజల హక్కులను కాపాడడానికే పోలీస్, న్యాయ వ్యవస్థలు పనిచేస్తాయని తెలిపారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, జీపీ కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

స్క్రాప్ ఇండస్ట్రీస్‌లో అగ్ని ప్రమాదం



ఖలీల్‌వాడి: అర్సపల్లిలోని బోధన్ రోడ్డులో ఉన్న ఓ స్క్రాప్ ఇండస్ట్రీస్‌లో గురువారం వేకువజామున అగ్నిప్రమాదం జరిగినట్లు జిల్లా ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకొని, ఫైర్ ఇంజిన్‌తో మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ. 10లక్షల ఆస్తినష్టం వాటినట్లు అధికారులు పేర్కొన్నారు. ఫైర్ ఆఫీసర్ శంకర్, సిబ్బంది ఉన్నారు.

తల్లిని హతమార్చిన కొడుకు

- పింఛన్ డబ్బుల కోసం ఘాతుకం

వర్ని: పింఛన్ డబ్బుల కోసం తల్లిని కొడుకు హతమార్చిన ఘటన మండలంలోని జలాల్పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జలాల్పూర్ గ్రామానికి చెందిన మక్కపల్లి సాయిలుకు గతంలోనే వివాహం జరుగగా భార్య అతడిని వదిలి, పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో సాయిలు అతడి తల్లి సాయవ్వ(60) ఉంటున్నారు. మద్యానికి బానిసైన సాయిలు తరచూ డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. తల్లికి ఈనెల పింఛన్ డబ్బులు రావడంతో వాటిని తనకు ఇవ్వాలని సాయిలు గురువారం మధ్యాహ్నం ఘర్షణకు దిగాడు. తల్లి ససేమిరా అనడంతో అతడు బండరాయిని తీసుకొని తల్లిపై కొట్టగా తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు గమనించి ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేయగా, నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్సై మహేష్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మోపాల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై జడ్ సుస్మిత తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా బిచ్కుందకు చెందిన ముక్తా బాయి అంధురాలు. నగరంలోని ఆర్యనగర్‌లో నివాసముంటూ కంజర్ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కొంతకాలంగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కుటుంబసభ్యుల సహకారంతో పాఠశాలకు వస్తుంది. అందులో భాగంగా గురువారం విధులు ముగించుకుని తన అక్క కూతురు మమత సహకారంతో ఆటో కోసం రోడ్డు దాటుతుంది. ఈక్రమంలో మంచిప్ప వైపు నుంచి కాల్పోల్‌కు చెందిన వసంత్ బైక్‌పై అతివేగంగా వచ్చి వారిని ఢీకొట్టాడు. ప్రమాదంలో ముక్తాబాయికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుస్మిత తెలిపారు.

'ఆయిల్ పామ్' రైతులతో బైబ్యాక్ ఒప్పందం



రైతులకు ఒప్పందపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న రైతులకు గురువారం నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా బైబ్యాక్ ఒప్పంద పత్రాలు అందజేశారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన రైతులకు ప్రీ యూనిక్ కంపెనీ తరపున ఈ పత్రాలను అందించారు. పంట సాగుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వ సబ్సిడీలతో పాటు, ఇతర అన్ని విధాల తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ అన్నారు. ఇప్పటికే జిల్లాలో 5600 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్నారని, ఈ సంవత్సరం 1500 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట దిగుబడి చేతికి వస్తోందని అన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ బస్టాండ్‌లో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

- డిప్యుటేషన్ బాధలే కారణం!



చికిత్స పొందుతున్న పాషా

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్–2 డిపోకు చెందిన షేక్ హిమం పాషా (52) అనే డ్రైవర్ ఆర్మూర్ బస్టాండ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన షేక్‌హిమం పాషాను ఖమ్మం జిల్లా నుంచి నిజామాబాద్‌కు ఆరు నెలల కోసం డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఆయనతో పాటు నిమాజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు మొత్తం 63 మంది ఉద్యోగులను ఆరు నెలల కోసం డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. కానీ తాను వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు తిరిగి స్వస్థలాలకు పంపలేదని, ఈ విషయంలో ఎలాంటి న్యాయం జరగకపోవడంతో నిరాశ చెందానన్నాడు. సెలవులు కూడా ఇవ్వడం లేదని, ఉన్నతాధికారులను పలుమార్లు కలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీంతో మనస్తాపం చెందిన అతడు కరీంనగర్ నుంచి నిజామాబాద్ వస్తున్న సమయంలో ఆర్మూర్ బస్టాండ్‌లో తన బస్సును నిలిపి, ఎలుకల మందు తాగాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆర్మూర్ డిపో అధికారులకు మరింత సమాచారం కోసం ఫోన్ చేస్తే అందుబాటులోకి రాలేరు.

ఎడపల్లిలో ఒకరి ఆత్మహత్య

బోధన్: ఎడపల్లి మండల కేంద్రం శివారులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఎడపల్లికి చెందిన జడల భూమయ్య (60) తన పిల్లలకు వివాహాలు జరిపించడంతో అప్పులు పెరిగిపోయాయి. ఈక్రమంలో అప్పుల బాధ భరించలేక ఎడపల్లి మండల కేంద్రం శివారులోని పులి చెరువు కట్ట వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యాల రమ తెలిపారు.

బస్వాపూర్‌లో ఒకరు..

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై దత్తు గురువారం తెలిపారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన కందూరి లింగం(55) గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసై, తరచు భార్య, పిల్లలతో గొడవపడేవాడు. బుధవారం రాత్రి అతడు అతిగా మద్యం తాగి, ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. కుటుంబీకులు గురువారం ఉదయం లేచిచూడగా అతడు ఇంటి వెనుక ఉన్న స్లాబ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్‌కు గాయాలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ శివారులో గురువారం కృష్ణాజీవాడి జూనియర్ లైన్‌మన్ లక్ష్మీనారాయణ విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. స్థానికులు వెంటనే అతడిని కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం



ఖలీల్‌వాడి: తన దుకాణానికి అనుమతి ఇవ్వడం లేదని ఓ యువకుడు నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా.. నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ఉండే బాలాజీ పాలిటెక్నిక్ ప్రహరీ గోడ వద్ద పానీపూరి బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కేంద్రహోంమంత్రి పర్యటన సందర్భంగా తన దుకాణంతోపాటు ఇతర దుకాణాలను సెక్యూరిటీలో భాగంగా అధికారులు తొలగించారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మళ్లీ దుకాణాల ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో బాలాజీ గురువారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌తో ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అక్కడే ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ అడ్డుకుని యువకుడిని అక్కడి నుంచి పంపించి వేశారు.